క్లుప్తంగా

టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 9వ తరగతి విద్యార్థిని ఆవుల వెంకట సాత్విక ఎంపికైనట్లు హెచ్ఎం భవనం భద్రిరెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల చీరాల పేరీరా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జిల్లా స్థాయి బాలిక టెన్నికాయింట్ జూనియర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలిక ఈనెల 14వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో జరిగే అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సాత్వికను ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాస రెడ్డి, అనూరాధ, బాలసుబ్రమణ్యం, ఖమరున్నిసా బేగం, అభినందించారు.

అక్రమ ఎరువుల నిల్వల గోడౌన్ సీజ్



గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఏవో

అద్దంకి రూరల్ (సంతమాగులూరు): అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచిన గోడౌను అధికారులు సీజ్ చేశారు. సంతమాగులూరు మండలంలో అక్రమంగా నిల్వలు ఉంచిన ఎరువుల గోడౌన్‌ను పరిశీలించి మంగళవారం సంతమాగులూరు మండల ఏవో లావణ్య సీజ్ చేశారు. ఏవో వివరాల మేరకు మండలంలో ఫత్తేపురం గ్రామంలో ఎరువులు అక్రమంగా నిల్వచేసి అమ్ముతున్నారని సర్పంచ్ అయినాల గోపి, రైతు కనుమూరి ప్రసాద్ సమాచారం ఇవ్వటంతో ఏవో గంధం నాగేశ్వరరావు గోడౌన్‌ను పరిశీలించారు. అనుమతులు లేకుండా నిల్వ ఉంచి అమ్మకాలు జరుపుతుండటం రూ. 2.88 లక్షల విలువగల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాబ్ మేళాకు 82 మంది హాజరు

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని బీఏఆర్ అండ్ టీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు 82 మంది హాజరైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు మంగళవారం తెలిపారు. జాబ్ మేళాకు ఐదు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని అన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మేళాలో 12 మంది ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషుకుమారి, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, అభ్యర్థులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం



మార్టూరు: మంచం పైనుంచి కదలలేని స్థితిలో ఉన్న ఓ దివ్యాంగ యువతికి మార్టూరుకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ మంగళవారం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు విరాళంగా అందజేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన జన్నాజు పల్లి నాగేశ్వరరావు కుమార్తె రత్నకుమారి పక్షవాతంతో బాధపడుతూ రెండు కాళ్లు నడుము కదలిక లేక చాలా కాలంగా మంచంలోనే ఉంటోంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబం విషయం తెలిసిన స్థానిక హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి రూ. 5 వేల నగదు ఆమె కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌వలీ, సభ్యులు కే హరిబాబు, పుట్ట అయ్యప్పస్వామి, ముల్ల సైదా, షేక్ హబీబ్, కోటేశ్వరరావు, పోతురాజు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం

చినగంజాం: ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని చీరాల డివిజన్ డిప్యూటీ డీఈఓ అబ్బురాజు శ్రీనివాసరావు సూచించారు. చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అబ్బురాజు శ్రీనివాసరావును చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల సిబ్బంది స్వయంగా కలిసి హైస్కూల్ ప్లస్, ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, సోషల్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేస్తామన్నారు. హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్ బోధించుటకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఇవ్వాల్సిందిగా డీఈవో, ఆర్‌జేడీ దృష్టికి తీసుకొని వెళ్లి పాఠశాలలో పనిచేసేందుకు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో ఉన్న సైన్సు ల్యాబ్, వర్చువల్, డిజిటల్ క్లాస్ రూంలను ఆయన పరిశీలించారు. కొత్తగా నాడు నేడు ఫేజ్- 2లో ఇచ్చిన గదులు మరమ్మతులకు తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నకుమారి, ఉపాధ్యాయులు నరసింహారావు, నాజర్‌వలి, సూర్యనారాయణ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

● పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి యడం బాలాజీ

ప్రచార ఆర్భాటాలే చంద్రబాబు నైజం



యడం బాలాజీ, నియోజకవర్గ ఇన్‌చార్జి

చినగంజాం: ప్రచార ఆర్భాటాలే తప్పా ప్రజా సంక్షేమం గురించి పట్టించుకునే విషయంలో సీఎం చంద్రబాబునాయడు విఫలమయ్యారని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి యడం బాలాజీ అన్నారు. విజయవాడలో వరద ముంపు పొంచి ఉందని అధికారులు ముందుగానే హెచ్చరించినప్పటికీ అందుకు తగిన రక్షణ చర్యలు తీసుకునేందుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై జరగాల్సిన నష్టం జరిగిపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయిన తరువాత శుష్క వాగ్దానాలు చేసి ప్రయోజనం ఏమిటని ఆయన అన్నారు. గతంలో బుడమేరుతో రాష్ట్రంలో నష్టం జరిగిన విషయం తెలిసి ఉండి కూడా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం, ప్రజలను అప్రమత్తం చేయక పోవడం ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి నిదర్శనమని ఆయన ఆక్షేపించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందుగానే తీసుకొని ఉంటే విజయవాడ చుట్టు పక్కల ప్రజలకు ఇంతటి తీవ్ర నష్టం వాటిల్లి ఉండేది కాదన్నారు. వరద వచ్చి ప్రజలు నష్టాలు పాలై అల్లాడుతుంటే వారిని సకాలంలో రక్షణ చర్యలు అందించి ఆదుకోవాల్సింది పోయి గత ప్రభుత్వం తప్పులు చేసిందంటూ పరనిందకు పాల్పడుతూ మీడియాలో ప్రచారం చేసుకోవడం తప్ప బాధితులకు ఈయన చేసిందేమి లేదని విమర్శించారు. వరద ముంపు సంభవించి 10 రోజులు దాటుతున్నా ఇంకనూ వందల కుటుంబాలకు కనీసం తాగేందుకు గుక్కెడు నీరు సైతం దొరకక ఇబ్బందులు పడుతుంటే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రంలో రెండేళ్లు కరోనా సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి తక్షణ వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి లక్షల మంది ప్రాణాలను నిలబెట్టారన్నారు. అదేమంటే 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగాను, 40 సంవత్సరావు పైగా రాజకీయ అనుభవం ఉందంటూ ఊకదంపుడు బాకాలు వాయించుకునే చంద్రబాబుకు బుద్ధి వక్రీకరించి ఇటువంటి భారీ నష్టానికి రాష్ట్రం గురయ్యేందుకు కారకుడయ్యాడన్నారు. అధికారంలోకి వచ్చిన 3 నెలలకే రాష్ట్ర పరిస్థితి ఇలా ఉంటే నిండు ఐదేళ్లలో రాష్ట్ర గతి ఏమి కానుందో అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు.

● జోరుగా గణేమడి నిమజ్జనాలు
● ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్, సివిల్ పోలీసులు
● సందడి చేస్తున్న చిన్నారులు, నిర్వాహకులు

గణపతి బప్పా మోరియా !



వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు



కొణిదెనలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



వెలమవారిపాలెంలో గణపతి లడ్డును వేలం నిర్వహిస్తున్న నిర్వాహకులు

చీరాల టౌన్: గణపతి బప్పా మోరియా... జై బోలో గణేష్ మహారాజ్‌కి, బైబై గణేషా అంటూ భక్తులు గణనాథుళ్లని గంగఒడికి చేరుస్తున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనాలకు నాలుగో రోజు మంగళవారం వాడరేవుకు జోరుగా తరలివచ్చాయి. చీరాల, పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని గణనాథులను డీజే పాటల హోరు, యువకుల నృత్యాలు, గులాములు చల్లుకుంటూ ఊరేగింపుల అనంతరం నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువస్తున్నారు. ఈనేపథ్యంలో మెరైన్, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

బల్లికురవ/అద్దంకి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా వాడవాడలా ఏర్పాటు చేసినగణనాథులు నిత్యపూజలు అభిషేకాలు రాత్రులు భజనలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. మంగళవారం మండలంలోని వెలమవారిపాలెం గ్రామ కుడలిలో ఏర్పాటు చేసిన గణనాథుని చేతిలో ఉంచిన లడ్డును అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త టీ మురళీకృష్ణ రూ.60 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం గులాములు చల్లుకుంటూ డీజేలు పాట కచేరిలతో బైబై గణపయ్య అంటూ స్థానిక గుండ్లకమ్మలో నిమజ్జనం పూర్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ టీ. నరేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి మండలంలోని పరిసర గ్రామాల నుంచి వచ్చే వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం పోలీసులు తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదికి వెళ్లే దారిని శుభ్రం చేసి దారిని బాగు చేశారు. వినాయక నిమజ్జనాలు చేసుకునే వారు ఆ దారిలో నుంచి వెళ్లి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని చెప్పారు.

బల్లికురవ: మండలంలోని కోణిదెన గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిలువెత్తు గణనాథుడిని మంగళవారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. నాలుగు రోజులపాటు ఉదయం, సాయంత్రం విశిష్టపూజలు, అభిషేకాలు, రాత్రిళ్లు బజనలతో హోరెత్తించారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుకునేందుకు ట్రాక్టర్‌కు కటౌట్ ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



అద్దంకిలో శుభ్రం చేయిస్తున్న పోలీసులు



మార్టూరులో నిమజ్జనానికి తరలుతున్న గణేషుడు

హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

స్వర్ణ (కారంచేడు): రక్తహీనతతో ఇబ్బందులు పడే హైరిస్క్‌లో ఉన్న గర్భిణులు ప్రసవ సమయం వరకు వైద్యుల సూచనలతో తగు జాగ్రత్తగా ఉండాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన గర్భవతుల పరీక్ష కేంద్రంలో ఆమె సుమారు 37 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు మూడో నెల వచ్చిన వెంటనే మీ సమీప ఆశా, ఏఎన్ఎంల వద్ద మీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడు వారు మీ ఆరోగ్య వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి క్రమం తప్పకుండా మీకు అందించాల్సిన వైద్య సేవలను వారు గుర్తు చేస్తూ ఉంటారన్నారు. క్రమం తప్పకుండా వేయించాల్సిన టీడీలు, హిమోగ్లోబిన్ శాతంను కూడా గుర్తించి అవరమైన మాత్రలు, ఆరోగ్య సూచనలు అందిస్తారన్నారు. కనీసం నెలకు ఒక సారి వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. అసరమైన స్కానింగ్‌లు చేసి బిడ్డ ఎదుగుదల విషయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రసవ సమయానికి ముందే స్థానిక ఆశాలు మిమ్ములను వైద్యశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. అందుకు మీరు 108 వాహనంను కూడా వినియోగించుకోవచ్చన్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వీ నాగేశ్వరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఏఎన్ఎంలు, ఆశాలు, స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



స్వర్ణలో గర్భిణును పరీక్షలు చేస్తున్న డాక్టర్ షాలినీ

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



చెక్ అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు

అద్దంకి/అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ శింగరకొండ ఆధ్వర్యంలో వరదబాధితుల కోసం రూ. 57 వేలు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పిలుపు మేరకు విరాళాలు సేకరించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మంగళవారం తెలిపారు. క్లబ్ సభ్యుల నుంచి సేకరించిన రూ. 57 వేల చెక్‌ను రోటరీ అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీకి అందజేశారు. రోటరీ డిస్ట్రిక్ట్-3150 ఆపదర్బంధు ద్వారా వరద బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ.1000 విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మలాది శ్రీనివాసరావు, ఉబ్బా దేవపాలన, అద్దంకి లెవీ ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, బాచిన పూర్ణ చంద్రరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, అళహరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల డిప్యూటీ డీఈవో బాధ్యత స్వీకరణ

చీరాల అర్బన్: చీరాల డివిజన్ ఇన్‌చార్జి ఉపవిద్యాశాఖాధికారిగా అబ్బురాజు శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చీరాల మండలం ఈపూరుపాలెంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలలోని సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కారంచేడు ఎంఈఓ-2 ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ హైస్కూల్స్ హెచ్ఎంలు గుమ్మా శ్రీనివాసరావు, రత్నకుమారి, భవనం భద్రిరెడ్డి, ఎంబీ సుబ్బారావు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, కుర్రా రామారావు, కేబీ వెంకటేశ్వరరావు, జీటీఏ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబులు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గొప్ప ప్రజా సేవకుడు కనకయ్య

పర్చూరు (చినగంజాం): కామ్రేడ్ కృష్ణశెట్టి కనకయ్య గొప్ప ప్రజా సేవకుడు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆయన పేదల పక్షాన నిలబడి చేసిన పోరాటాల గురించి ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఆయన 9వ సంస్మరణ సభకు పలువురు వక్తలు హాజరయ్యారు. లక్ష్మీపురంలోని కనకయ్య స్థూపం వద్ద ఆయనకు కొద్దిసేపు జోహార్లు అర్పించిన అనంతరం బాలికోన్నత పాఠశాలలోని కనకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ కనకయ్యతో వారికి గల సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కనకయ్య ప్రాంతీయ విద్యాభివృద్ధి మండలిని నెలకొల్పి అనేక మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాదానం చేసినట్లు తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి కృష్ణంశెట్టి పార్వతి, కుమారుడు అజయ్ బాబు, ఏపీ సచివాలయ ఉద్యోగులు సంఘం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ, ప్రముఖ రంగస్థల నటుడు కారుమూరి సీతారామయ్య, శారదా స్కూల్ డైరక్టర్ కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, షేక్ అహ్మద్ బాషా. కొల్లా హనుమంతరావు, చింతగుంట శ్రీనివాసరావు, న్యాయవాది కాసా అశోక్, కృష్ణంశెట్టి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద కృష్ణంశెట్టికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జే.పంగులూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీవో రామాంజినేయులు, ఎంఈఓ వీరాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 44 పాఠశాలలో హెచ్ఎంలు, విద్యాకమిటీ చైర్మన్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏంఈఓ మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ఐఎంఎంఎస్ నందు టాయిలెట్స్ ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఎండీఎం మానటరింగ్ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. పది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని, అకడమిక్ క్యాలెండర్ పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. పాఠశాలను వదిలిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ మీడియట్ చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

కోలలపూడిలో అక్రమ మద్యం ?

మార్టూరు: మండలం కోలలపూడి గ్రామంలో ఇతర రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం నిల్వ గురించి మంగళవారం గ్రామంలో చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిళ్లను భారీస్థాయిలో మండలంలో తరలించి విక్రయాలు సాగిస్తుంటాడు. అందులో భాగంగా సోమవారం రాత్రి 9 కేసుల మద్యం బాటిళ్ల గ్రామానికి తరలించాడు. గ్రామానికి పడమర వైపు గల కొండ సమీపంలో ఓ షెడ్డులో నిల్వ ఉంచిన 9 మద్యం కేసుల్లో మంగళవారం ఉదయం 5 కేసులను స్థానికంగా విక్రయించారని సమాచారం. గ్రామంలో యథేచ్ఛగా మద్యం వ్యాపారం జరుగుతుండటంతో కొందరు స్థానిక మహిళలు మీడియాకు సమాచారం అందించడం గమనార్హం.

వక్రతుండాయ బహురూపాయ



ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శేషశయన గణపతి



చీరాలలో ప్లాస్టిక్ బాళ్లు, బ్యాట్‌లతో అలంకరించిన వినాయకుడు

చీరాల అర్బన్/వేటపాలెం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎంజీసీ మార్కెట్‌లో భారీ గణనాధుడిని ఏర్పాటు చేశారు. అనంత పద్మనాభ స్వామి మాదిరిగా శేషశయన గణపతిని ఏర్పాటు చేశారు. అలానే పట్టణంలోని లక్ష్మీపావని జ్యూవెలరీస్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్లాస్టిక్ బాల్స్, బ్యాట్‌లతో అలంకరించారు.

వేటపాలెం: గ్రామాల్లో వినాయక చలువ పందిళ్లలో నెలకొల్పిన వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో నాలుగో రోజు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు

కారంచేడు: మండలంలోని పుట్టాయిపాలెంలో కొలువైన బొజ్జ గణపయ్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపయ్య విగ్రహం వద్ద అలయ అర్చకులు ఆవుల రాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గణపయ్య




వేటపాలెంలో ప్రత్యేక పూజలు నిర్వహస్తున్న భక్తులు

సమతుల ఆహారంతో ఆరోగ్యం

పర్చూరు (చినగంజాం): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పౌష్టికాహారం అందించాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పర్చూరు సీడీపీఓ సుభద్రాదేవి అన్నారు. మంగళవారం వీరన్నపాలెం-5 అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సమతుల్య ఆహారానికి సంబంధించి వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. సూపర్‌వైజర్ రాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు: పోషక విలువలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం వలన శారీరక మానసిక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్ట్ దర్శి సెక్టార్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కోనంకి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యకర్తలు కల్పన కనక దుర్గ, శివలీల, అక్కమ్మ పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చీరాల: ఉద్యమ నినాదంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని సీపీఐ సీనియర్ నాయకుడు మేడ వెంకట్రావు అన్నారు. విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చీరాలలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగేంతవరకు ఉద్యమాలు ఆగవన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరించాలనే దుష్ట ఆలోచనలు మానుకోవాలన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ ఆదీనంలో నడపాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రకాష్‌బాబు, బీసి ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు, నియోజకవర్గ అధ్యక్షులు ఎ.బాబూరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.